క్లుప్తంగా

అక్షింతలకు పూజలు



చిల్పూరు: అయోధ్యలో ఈనెల 22న రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠలో భాగంగా మండలంలోని పల్లగుట్టలో శనివారం ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో రాములోరి అక్షింతలకు అర్చకులు కేశోజు బ్రహ్మాచారి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు గ్రామానికి చెందిన ముక్కెర గోపాల్–లావణ్య, బత్తిని రాజు–రమ దంపతులు మాట్లాడుతూ నేడు(ఆదివారం) హోమం, అక్షింతల పంపిణీ, సోమవారం హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ బత్తిని శ్రీనివాస్, ఎనమల వెంకటస్వామి, వేల్పుల రాజు, సాదం వేణు, కన్నెబోయిన సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి జెండాలు

దేవరుప్పుల: రామజన్మభూమి అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకొని పల్లెల్లో ఇంటింటికీ జైశ్రీరామ్ జెండాలు వెలుస్తున్నాయి. శనివారం మండలంలోని పెద్ద మడూరులో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటా జై శ్రీరామ్ జెండాలను పంపిణీ చేశారు. బీజేపీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ పెద్దగాని రాజు,ఆకవరం జనార్దన్‌రెడ్డి, మలిపెద్ది నర్సింహ్మా, పటుబ్బారి శేఖర్, నాయకపు శ్రీను, గొడిశాల రాజేందర్, రుద్రోజు పరమాత్మ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవతో కృషిచేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన రెట్టింపు ఉత్సాహంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత



చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో శనివారం సెనెర్జియా గ్రూప్ చైర్మన్ జీడీ జాన్ ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి స్టాఫ్ నర్సు దార ప్రేమలత వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు కొయ్యడ శోభారాణి, కోఆర్డినేటర్ల శ్రీను, మిన్ను పాల్గొన్నారు.

కురుమ సంఘం నియోజకవర్గ కమిటీ ఎన్నిక



బచ్చన్నపేట: కురుమ సంఘం నియోజకవర్గ కమిటీని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అందె బీరయ్య ఆధ్వర్యంలో కొమురవెల్లి దేవస్థానం వద్ద కురుమ సత్రంలో శనివారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా ఓరుగంటి శంకర్, ఉపాధ్యక్షుడిగా సూర్న శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా అందె నాని, కార్యదర్శిగా జంగిలి యాదగిరి, సహాయ కార్యదర్శిగా అత్త్యారి జయరాములు, కోశాధికారిగా బండారి కనుకయ్య, గౌరవ అధ్యక్షులు కామల్ల అనిల్, మీస సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా బండారి సత్తయ్య, బింగి రాములు, నంగి చంద్రమౌళి, సూర్న సంపత్, శెవల్ల కృష్ణ, మ్యాక యాదగిరి, ఏగుర్ల మల్లేశంను ఎన్నుకున్నారు.

మొక్కలను సంరక్షించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లోని వన నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను వంద శాతం రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు, వన నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందులు కలుగకుండా, నీటి సరఫరా పైపుల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. అలాగే ఇళ్లలోని చెత్తను ఆరు బయట పడవేయకుండా చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లలో వేసేలా అవగాహన కల్పించాలన్నారు.

ఇష్టారీతిన లేఔట్

- ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాల్లో రీ లేఔట్
- లబ్ధిదారుల నుంచి రూ.2వేలు వసూలు..?
- వివాదంలో 20 ఏళ్ల క్రితం ఇచ్చిన స్థలం



రీ లేఔట్ చేసిన స్థలం (ఇన్‌సెట్‌లో) గతంలో ఇచ్చిన పట్టా

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తిలో ప్రభుత్వం 20 ఏళ్ల క్రితం పేదలకు పంపిణీ చేసిన నివేశ స్థలాలు నేడు వివాదాస్పదమవుతున్నాయి. వంద గజాలతో లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వగా గతంలోని ప్రజాప్రతినిధులు 90 గజాలకు, నేడు 80 గజాలకు రీలేఔట్ చేసి ఎవరికి వారుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. రీలేఔట్‌కు ఖర్చులు అయ్యాయని ఒక్కొక్క లబ్ధిదారుని వద్ద రూ.2వేలు వసూలు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

20 ఏళ్ల క్రితం పట్టాలు

జనగామ–సూర్యాపేట రోడ్డులో వనపర్తి స్టేజీ సమీపంలో 145 సర్వే నంబర్‌లో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 2003లో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 160 మందికి పట్టాలు పంపిణీ చేశారు. గ్రామానికి కొద్దిగా దూరంగా ఉండడంత అప్పటి నుంచి ఆ స్థలంలో ఎవరు ఇళ్లు నిర్మించుకోలేదు. పట్టాలు మాత్రం లబ్ధిదారుల వద్దనే ఉన్నాయి. అదే స్థలాన్ని ఇటీవల ఎన్నికల ముందు కొత్తగా పట్టాలు పంపిణీ చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే రాజయ్య ప్రయత్నం చేశారు. తనకు టికెట్ రాకపోవడంతో అంతగా పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో భూమిని విక్రయించిన భూయజమానులు తమకు 145 సర్వే నంబర్‌లో 4.37 ఎకరాలు ఉండగా అందులో 4.07 ఎకరాలు మాత్రమే ప్రభుత్వానికి విక్రయించామని, ఇంకా 30 గుంటల భూమి ఉంటుందని సర్వే చేసుకున్నారు. దీంతో 160 మంది లబ్ధిదారులకు ప్లాట్లు తక్కువ అవుతున్నాయని ఎవరికివారుగా రీ లేఔట్ చేసి 80 గజాల చొప్పున ప్లాటింగ్ చేసుకున్నారు. అందుకు ఖర్చులు అయ్యాయని ఒక్కొక్కరి వద్ద రూ.2వేలు వసూలు చేస్తున్నారు. దీంతో కొంత మంది డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించారు. అంతే కాకుండా గతంలో 145 సర్వే నంబర్‌లో మొత్తం ప్లాట్లు చేసి ప్రభుత్వం వంద గజాల చొప్పున ఇస్తే నేడు కొంత మంది ఇలా రీ ప్లాట్లు చేసి డబ్బులు వసూలు చేస్తూ స్థలాన్ని తగ్గించమేంటని శనివారం విలేకరులతో కొంత మంది లబ్ధిదారులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సర్పంచ్, ఎంపీటీసీలే ఇదంతా చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



మాట్లాడుతున్న లబ్ధిదారులు

నాకు ఎలాంటి సంబంధమూ లేదు

నివేశన స్థలాల్లో రీ లేఔట్ విషయంలో నాకు సంబంధంలేదు. అప్పటి లబ్ధిదారులు మాత్రమే చదును చేసుకొని రీ లేఔట్ చేసుకున్నారు. డబ్బుల వసూలు నాకు తెలియదు.

\- ఉంగరాల శ్రీధర్, సర్పంచ్, వనపర్తి

సర్వే చేయించి మిగిలింది తీసుకున్నాం..

ఇళ్ల స్థలాల కోసం గతంలో ప్రభుత్వానికి అమ్మిన భూమి మాదే. 145 సర్వే నంబర్‌లో 4.07 ఎకరాలు మాత్రమే అమ్మినం. ఆ నంబర్‌లో ఇంకా మాకు 30 గుంటల భూమి ఉంది. సర్వే చేయించి హద్దులు పెట్టుకున్నాం. మిగిలిన దానిలో లబ్ధిదారులే రీ లేఔట్ చేసుకొని తీసుకున్నారు.

\- గోలి రాజిరెడ్డి, ఎంపీటీసీ వనపర్తి

ఎవరికి డబ్బులు ఇవ్వొద్దు

గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు. అందులో ఎవరు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. రీలేఔట్ జరిగిన విషయం తన దృష్టికి రాలేదు. ఏమైన ఉంటే విచారణ జరిపిస్తాం.

\- వినయలత, తహసీల్దార్, లింగాలఘణపురం

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న చందు

జనగామ రూరల్: పాడి రైతులకు గత 3 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు వెంటనే చెల్లించాలని, లీటరుకు రూ.5 ఇన్సెంటివ్ చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హమీలో భాగంగా లీటర్ పాలకు ఇన్సెంటివ్ రూ.5 ఇస్తామని ఇవ్వలేదని అన్నారు. గత మార్చి 2021 నుంచి నేటి వరకు ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్‌చే శారు. జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీకి ఎక్కువ సంఖ్యలో రైతులు పాలు పోస్తున్నారని, మూడు నెలలుగా పాల బిల్లులు ఆగిపోయాయని అన్నారు. అవినీతికి అడ్డాగా జనగామ పాలడెయిరీ మారిందని విమర్శించారు. మాచర్ల సారయ్య, మీట్యానాయక్, రవీందర్ రెడ్డి, అంజయ్య, భవాని, శివ, రామచొక్కం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం నుంచి రంగరాయగూడెం మీదుగా కోమటిగూడెం వెళ్లే రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇప్పగూడెం–కోమటిగూడెం రోడ్డు పనులను సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. రోడ్డు పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ వైఖరిపై వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత నాలుగైదు సంవత్సరాలుగా అధ్వానంగా ఉన్న ఈరోడ్డుతో మూడు గ్రామాల ప్రజలతో పాటు దారివెంట వెళ్లే వాహనదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలతో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. కాగా ఎట్టకేలకు ఆరు నెలల క్రితం ఈ రోడ్డు పనులు ప్రారంభించగా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ సత్వరమే స్పందించాలని, కల్వర్టులు, రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, మంద ఇలిషన్, ఎదునూరి యాకయ్య, కత్తుల రాజు, నర్సింహులు, మల్లయ్య, ఉప్పలయ్య, సోమయ్య, రాజు, యాదగిరి, శ్రీను, సతీష్, యాదగిరి, కిష్టయ్య, కరుణాకర్, రవి, శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాతకు బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో దుర్గామాతకు గ్రామస్తులు శనివారం బోనాలు చేశారు. దుర్గామాత ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా ఆయా కులస్తులు తమ కుల దైవాలకు బోనాలను చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద రాత్రి వేళ దుర్గామాత కథాపురాణం చెప్పి కల్యాణం నిర్వహించారు. నేడు (ఆదివారం) గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు వన భోజనాలకు వెళ్లనున్నారు. ఉత్సవాలకు ఇబ్బందులు కలుగకుండా ఎస్సై కంకల సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, ఎంపీటీసీ నర్సవ్వ, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నియామకం



రాజు

రఘునాథపల్లి: మండలంలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన బాయికాని రాజు అయ్యవారి గూడెం, కుర్చపల్లి రెండు గ్రామాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా నియామకం అయ్యారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర శనివారం రాజుకు నియామకపు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రెండు గ్రామాల బాధ్యతలు అప్పగించిన ఇందిరకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకుల సహకారంతో పార్టీ సత్తాచాటుతామని పేర్కొన్నారు. రెండు గ్రామాల ఇన్‌చార్జ్‌గా నియామకమైన రాజును కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అస్లాం



మండలంలోని మాధారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ అస్లాం కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ జాఫర్‌షరీఫ్ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలతో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర శనివారం అస్లాంకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అస్లాం మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు అవిశ్రాంతిగా కృషి చేస్తానన్నారు. తన నియమానికి సహకరించిన జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదష్‌చందర్‌రెడ్డి, నాయకులు గుగులోత్ కొమురెల్లి, రాజ్‌కుమార్, సుమన్ ఉన్నారు.

తమ్మడపల్లి (జీ)కి బస్సు నడిపించాలి

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)కి హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్సు నడిపించాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు హనుమకొండలో డిపో మేనేజర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమకొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మీదుగా తమ్మడపల్లి (జి) గ్రామం నుంచి పాలకుర్తి మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సర్వీసు కల్పించాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, సిహెచ్ కృష్ణమూర్తి, మర్రి రమేష్, సత్యనారాయణరెడ్డి, దాసరి నాగరాజు, ఓరుగంటి రాజు ఉన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: ఉపాధ్యాయులకు పదోన్నతులు వెంటనే కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కోరుకొప్పుల రాజు, వి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నోడల్ ఆఫీసర్ ఎండి పర్వేజ్ చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలను విడుదల చేయడంతోపాటు బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. భానుప్రకాష్, రవి, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, యాదగిరి, సిరాజుదిన్, రాజేందర్, రమేష్, శంకర్, వేణుగోపాల్, స్వరూపరాణి, విజయశ్రీ పాల్గొన్నారు.

లింగంపల్లి జాతర అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధి పనులను శనివారం సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటి రవీందర్ ప్రారంభించారు. ఉప సర్పంచ్ కంకటి రాజన్న, మాజీ చైర్మన్‌లు గంగుల సంపత్‌రెడ్డి, మోతె శ్రీనివాస్, కండ్లకోలు బాలరాజు, కే. శ్రీనివాస్, తుత్తరు రాజు, అపరాదపు రాజు, కందుకేరి రాజు, మామిడాల బాలరాజు, నరేందర్, రవీందర్, గాజుల రజని, ఊరడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికలను తలపించిన మాక్ పోలింగ్



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

దేవరుప్పుల: చిన్నమడూరు హైస్కూల్‌లో సాధారణ ఎన్నికలను తలపించేలా విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. శనివారం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.వెంకటయ్య పర్యవేక్షణలో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువలు తెలిసేలా అవగాహన కల్పించడంతో నిజంగా జరిగే ఎన్నికలు జరుగుతున్న తీరులా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పోలింగ్‌కు వచ్చే ఓటర్లకు స్లిప్పులు, క్యూకట్టడం, పోలింగ్ ఏజెంట్లుగా ఓటరును చెక్‌చేయడం, ఎన్నికల ప్రొసీడింగ్ టీం విధులకు తీసిపోకుండా ఓట్లు వేసే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఇందులో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా కమలా టీచర్, రిటర్నింగ్ ఆఫీసర్‌గా శృతి, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా కుమారస్వామి వ్యవహరించారు.

విద్యారంగ సమస్యలపై సమావేశం నిర్వహించాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని డీటీఎఫ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ షరీఫ్ కోరారు. శనివారం నూతన సంవత్సరం డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ గూడూరు జెడ్పీ పాఠశాలలో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిదిరాల శ్రీనివాస్, పి.కమలాకర్ రెడ్డి, డి.సూర్యప్రకాశ్, సదానందం, రమేష్, మధుకర్, గూడూరు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇమ్యూనైజేషన్‌ను విస్మరిస్తే అనర్థాలు తప్పవు



వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

దేవరుప్పుల: ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు వేసుకోవడం విస్మరిస్తే చిన్నారులకు అనేక అనర్థాలు వస్తాయని మండల వైద్యాధికారి రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శివారు ప్రాంతమైన దాదాసాహెబ్ కాలనీలో ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పుట్టిన ప్రతి శిశువుకు నిర్దేశించిన వ్యాక్సిన్లు సజావుగా వేసేలా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించి ప్రభుత్వ ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులకు లింగాకర్షక బుట్టల పంపిణీ



లింగాకర్షక బుట్టలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తరిగొప్పుల: లోడీ సాంఘిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మానోస్ యూనిదాస్ సహకారంతో సంస్థ డైరెక్టర్ ఫాదర్ సింగారెడ్డి ఇన్నారెడ్డి ఆదేశానుసారం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు శనివారం లింగాకర్షక బుట్టలు, ఎల్లో ప్లేట్స్, వేప నూనె పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాల శౌరి మాట్లాడుతూ సేంద్రియ సాగు విధానంలో ఎల్లోప్లేట్స్ వరి పొలంలో ఏర్పాటు చేసుకోవడంవల్ల తెల్ల, పచ్చ, నల్ల దోమలతో పాటు చిన్న చిన్న క్రిమికీటకాలు నాశనం చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. లింగాకర్షక బుట్టలు చిరుధాన్యాల పంట పొలాల్లో ఉన్నటువంటి లద్దెపురుగు, పచ్చ పురుగు, రెప్పల పురుగులను నివారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. వరి, కూరగాయలు, చిరుధాన్యాల పంటలకు వేపనూనే పిచికారి చేస్తే ఎలాంటి తెగులు ఉన్నా నివారించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోడం సత్యనారాయణ. సిబ్బంది కనకం రవీందర్, భూక్య బిచ్చ, తిరుమల, రమేష్, పంచాయతీ కార్యదర్శి నవనీత తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఓటరుగా నమోదుకు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాస్‌ఫొటోను అందించాలన్నారు. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు అర్హులను గుర్తించి వారిని ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. బీఎల్‌ఓలు, ఓటర్లు పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

పాలకుర్తి: శాతపురం పరిసర తండాకు చెందిన గుగులోత్ దూలమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు శనివారం పరామర్శించారు. పాలకుర్తి సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, కొడకండ్ల మండల మిత్రులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

రంగాపురంలో..

కొడకండ్ల: మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు వల్లూరి సోమలక్ష్మి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ గ్రామానికి చేరుకొని సోమలక్ష్మి మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు యాకేష్‌యాదవ్‌నైలయ్య, భిక్షపతి, యాదగిరి, వెంకన్న, సతీష్, యాకయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: సీనియర్ పాత్రికేయుడు విజయ్‌కుమార్ తల్లి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ స్టేట్ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు పరామర్శించారు. శనివారం మండల కేంద్రంలో మృతురాలు ఈటూరి అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. దయాకర్, మొలుగూరి రమేష్, ఈదునూరి నర్సింహారెడ్డి, కారుపోతుల బిక్షపతి గౌడ్, ఆకుల మల్లయ్య, తీగల కొండయ్య ఉన్నారు.

చేయూత

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన కొత్తపెల్లి రాజమ్మ ఇటీవల గుండెపోటుతో మృతిచెందింది. మృతురాలి కుమారులు కుమారస్వామి, రాజుతో కలిసి 2003–04 పదో తరగతి చదివిన బాల్య స్నేహితులు శనివారం రూ.15వేలు అందించారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి క్రాంతికుమార్, దుబ్బాక రంజిత్‌కుమార్, ఇల్లందుల మహేష్, మోడెం సంపత్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో బరాబరి యాదయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, కుటుంబ సభ్యులకు గ్రామ గౌడ, ముదిరాజ్ సంఘం సభ్యులు ఆర్థిక సాయం శనివారం అందజేశారు. అలాగే మృతుడి స్నేహితుడు, పూర్వ విద్యార్థి, రెడ్డి సంఘం అధ్యక్షుడు కొల్ల నర్సిరెడ్డి క్వింటా బియ్యం అందించారు. పలువురు నాయకులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ సర్పంచ్ చల్ల సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, నాయకులు ఆముదాల సుధాకర్‌రెడ్డి, గూడెముల్ల ప్రభాకర్, బత్తిని యాదగిరి, పర్దయ్య. రవి, ఉత్కం సత్తయ్య, బొమ్మకంటి శ్రీనివాస్, పెసరు యాదయ్య ఉన్నారు.

కొత్తపల్లిలో స్టార్టర్ల చోరీ

లింగాలఘణపురం: కొత్తపల్లిలో అన్నపురం శ్రీనివాసు, మరాఠి ఉప్పలయ్యకు చెందిన వ్యవసాయ బావి వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటర్ స్టార్టర్లతో పాటు వైర్‌ను దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. గత రెండేళ్లలో కూడా ఇదేవిధంగా స్టార్టర్లు వైర్ దొంగతనం జరిగిందని, ఈసారి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

పాలకుర్తి: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలంగాణ రక్షణ వేదిక రాష్ట్ర నాయకుడు మేడారపు సుదాకర్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ తీరందాసు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు గిలకత్తుల సోమశేఖర్, జలగం అశోక్, కమ్మగాని వెంకటేశ్వర్లు, కోడెం సాయిరాం పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

బచ్చన్నపేట: ఈ నెల 22న అయోధ్యలో జరుగనున్న రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. హోమాలు, యజ్ఞాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలు దేవాలయాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: అయోధ్యలో బాలరాముడు కొలువుదీరనున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మండలంలోని పలు దేవాలయాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం నిర్వహించారు. జఫర్‌గఢ్, కూనూర్, తిమ్మంపేట, శాపల్లి, సాగరం, వడ్డెగూడెం, తమ్మడపల్లి (ఐ) తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, గడ్డం యాకయ్య, ఎల్లచారి, సింగారపు రమేష్, నల్లతీగల చిరంజీవి, దుద్దుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.